లతాంతకి పండుగబహుమతీ

పాలెపు వేంకటరత్నముగారు

మాఅత్తారిది ప్రకృతిశోభాపరిపూర్ణమైన ఒకచిన్న పల్లెటూరు. పుష్యమాసంలో ప్రకృతి సౌభాగ్యలక్ష్మీ నిలయమై, నయనానందదాయకమై, దర్శనీయమై ఆగ్రామశోభ ద్విగుణీకృతమైంది. నే నసలు కళోపాసకుణ్ణి. మాఅత్తగారి పెరట్లో చాలాగా నాటబడిన బంతిచెట్లపువ్వులు మాస్తుంటే సౌహృదయ ముప్పొంగుతూఉండేది. ఆబంతిచెట్లప్రక్కనే వికసితసుమసంపదచే నొప్పారు చేమంతంటు. ప్రకృతికళోపాసకులకు పుష్పదర్శనం కంటె పరమానందం ఏముంటుంది?

ఈమధ్య రాజమ్హంద్రీవచ్చినప్పుడు మామామగారు కాలేజీకి సెలవులివ్వడంతోటే వారి ఊరురమ్మని నన్నాహ్వానించేరు. నేనూ సెలవులివ్వడంతోటే మానాన్నగారిసెలవుపొంది సూటుకేసుసర్దుకొని బయలుదేరేను. చిగురికి ఒకరాత్రి పడవప్రయాణంకూడాచేస్తేనేగాని ఆఊరుచేరలేం.

ఉదయం ఆరుగంటలకు పడవదిగి ఊళ్లోకి నడిచివస్తున్నాను తలకుకట్టుకున్న ఫ్లానలుమఫ్లరు, వల్లెవాటుగా కప్పుకున్న కాష్మీర్ శాలువ, కాళ్లకి స్నోప్రూఫ్ శాండల్ ను నేను. వెనక కూలిమనిషి పెట్టెపట్టుకొస్తున్నాడు. ఊరిబయట కాపుగారొకరు ధూమపానంచేస్తూ, కుక్కుటరాజాన్ని చంకపెట్టుకొని యెదురై చల్లోవణకుతూ "యేవూరుబాబూమన్ది!" అన్నాడు. "రాజమంద్రీ" అనిచెప్పి ఒచ్చేస్తున్నాను. "అయితే మనివి. యెవరింటికి బ్బాబూ!" అన్నాడు.

"కరణంగారింటి"కనిచెప్పి నానడకవేగాన్ని హెచ్చించి, ఈపల్లెటూరికాపులకీప్రశ్నపరంపర సహజమనుకుంటూవస్తున్నాను. "అలాగా బాబూ! చిన్నమ్మాయిగారిపెనిమిటా?" అని సంతోషిస్తూ కాపుగారు నిష్క్రమించేరు.

గ్రామంలో కాలుపెట్టాను. చిగురింటమ్మాయిలు వీథిలో ముగ్గులుపెట్టుతూ గొబ్బెమ్మలకి మ్రొక్కుకుంటున్నారు. వారిలోఒకమ్మాయి తలెత్తి నన్నుచూచి ప్రక్కమ్మాయితో "ఒసేవ్! మనచిన్నమ్మాయిమొగుడేవ్!" అంది. వెంటనే ఆబాలికామూర్తి ముందుగా కబురందించడానికి మావాళ్లింటికి చెంగునపరుగెట్టింది. ప్రక్కయింటిఅరుగుమీద కొందరుయువకులు-వారూఅల్లుళ్లేకావచ్చును-చతుర్ముఖపురాణం సాగిస్తున్నారు. ప్రక్కనొకకుర్రాడు 'స్థిరమైననడవడి' గానంచేస్తున్నాడు.

మాఅత్తగారిగుమ్మంల్లో కాలుపెట్టేను. వంటలక్క సుబ్బమ్మగారు పెద్దచెంబునీళ్లతో ప్రవేశించి "వచ్చారు బాబూ! చిలకతంద్రీ! కాళ్లుకడుక్కోండి" అంది. నేను 'సేండల్సు' తీసేసి కాళ్లుకడుక్కుంటున్నా. మాఅత్తగారు సావిట్లోకివచ్చి "కూచో బాబూ! ఇంటిదగ్గర్నుంచేనా! అంతాక్షేమమేనా!" అని కుశలప్రశ్నమడిగింది. ఆ! క్షేమమే! అని జబాబుచెప్పేను.

ఇంతలో సుబ్బమ్మగారు తెచ్చిన ఖద్దరుతువ్వాలుతో కాళ్లుతుడుచుకొని శాలువ కొంకెకుతగిలించి మఫ్లరు విప్పేసి క్రాఫుసర్దుకుంటూ ఈజీఛెయిరులో కూర్చున్నాను. వీథిలోనుంచి మాబావమరదివచ్చి "ఇదిగో! వసంతంబావా! మేమనుకుంటున్నాం ఈవేళొస్తావని. ఏమిటిసంగతి? పరీక్షలు బాగారాశావా?" అంటూ యెదురుగుండా 'రోజ్ వుడ్డు' కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతట్లో ఆచిగురింటమ్మాయిచెప్పినకబురు పనిచేసిందాఅన్నట్టు సుబ్బమ్మగారు రెండుప్లేట్లఉప్మా, కాఫీకూజా, రెండుచైనాకప్పులు, సాసర్లతోటీప్రవేశించి టేబిల్ మీదుంచి వెళ్లిపోయింది. మామామగారు పల్లెటూరువారైనా నాగరికతాపరిపూర్ణులు. మామగారేరంటే పొలంవెళ్లారన్నారు. నేనూ మాబావా కబుర్లు చెప్పుకుంటూ 'టిఫెను' తీసుకుంటున్నాం. మాఅత్తగారు నాచదువునిగురించి ప్రశ్నలువేస్తోంది. నేనీజీఛెయిర్లో

కూచున్నప్పటికీ నాకళ్లు లతాంతకోసం చుట్టుప్రక్కల వెతికేస్తున్నాయి. నాకెదురుగానున్నగదిలోనుంచి ఒక ముఖపద్మం నన్ను తొంగిచూస్తున్నట్టు కనిపించింది.

ఆమరునాడు నేను సావిట్లో 'స్క్రీన్' ప్రక్క కుర్చీలోకూర్చునిఉన్నాను. వీధిలో నొకకోయస్త్రీ -భిక్షుకురాలు- మధురమధురగాత్రంతో భిక్షాప్రార్థనంచేస్తోంది.

బిచ్చమెట్టుతల్లో!-బిచ్చమెట్టుతల్లి!
బిడ్డలుగలతల్లో!-పాపలుగలతల్లి!

మాభావమరదిభార్య మణీదేవి బిచ్చగత్తెకు తండులములతో ప్రవేశించి నవ్వుతూ "లతాంతా! లతాంతా! ఇదిగో ఈకోయవాళ్లపిల్లచూడవే, నీలాల్లాగ మెరిసిపోతున్నకళ్లతో యెంతబాగుందో! యిలారా" అని పిలిచింది.

నేనూ మందహాసంతో ప్రియాసందర్శనానికి 'రెడీ'గాకూచున్నాను.

నాకెదురుగానున్న గదితలుపుతెరుచుకొని ముగ్ధమోహనకల్యాణమూర్తి లతాంతసావిట్లోదాకవచ్చి ననుచూచి త్రపాభరానతయై వదినెగారిని "పో"అంటూ నన్నుతిర్గిచూస్తూ గిరుక్కునమళ్లిపోయింది.

మణీదేవి నాప్రక్కనిలబడి తప్పట్లుకొట్టి నవ్వుతోంది.

నాకళ్లల్లో అమృతంకురిసినట్టయింది. లతాంతవేషం చాలామనోజ్ఞంగాఉంది. కణుగురంగు ఖద్దరు పరికిణీ, స్నఫ్‌కాలర్, బ్లౌజ్‌కాలరు ఖద్దరుజాకెట్టు, సన్నటిఖద్దరువోణీపయట. పయటకొక పెద్దబ్రోచ్, కృష్ణసర్పమువలె దీర్ఘమగువాలుజడ, కాళ్లకు జాలరుపట్టాలు.

నేను కార్యమైనతరువాత మాఅత్తారింటికదే ప్రథమపర్యాయం రావడం. అందుచేతనే లతాంత ప్రేమ మధువెంతగ్రోలినను తనివిదీరకుండాఉంది. చూచినప్పుడల్లా క్రొత్తభావాలు కలుగుతున్నాయి. అప్పుడు తోచినభావానికి ప్రతిఫలంగా ఈక్రిందిగీతం నానోటుబుక్కులో వ్రాసుకున్నాను.

ముగ్ధమోహనకల్యాణమూర్తి నీదు
తేల్చుచున్నవి సతతవర్షిష్ణువిపుల
ప్రణయవినిబద్ధవీక్షణప్రగ్రహములు
మోహవారాశిలో నేను మునుగకుండ.

లతాంతసౌందర్యమును సంపూర్తినొందించుటకు లోలాకులు లోటుగాఉన్నాయి.........

ఈరీతిగా నేను మాఅత్తారింట్లో మహదానందంగా, పౌష్యప్రకృతిసౌందర్యానికి ముగ్ధుణ్ణౌతూ, భావ గీతాలురాసుకుంటూఉన్నాను.

ఒకనాడుఉదయానికి మావదినెగారు, తోడల్లుడుగారూవచ్చేరు. మాఅత్తగారువచ్చి మావదినెగారిని ప్రేమపూర్వకాలింగనంతో లోనికితీసుకెళ్లింది. మావదినెగారు నన్నుపలుకరించి లోపలికెళ్లింది. మాతోడల్లుడు గారికి ఉచితమర్యాదలన్నీజరిగాయి. ఆయన నన్ను కుశలప్రశ్నచేసినారు. మాతోడల్లుడు విద్యాధికుడు. విశాఖపట్టణమందలి సుప్రసిద్ధన్యాయవాది. ఎం. ఏ; బి. యల్. వారూ నేనూ అత్యానందంగా రోజులుగడుపు తున్నాం.

భోగినాడుదయం కాఫీలుపుచ్చుకొని నేనూ, మాబావా, అన్నగారు షైరు బయలుదేరాం పొలాల కేసి. వీధులో గంగెద్దులవాండ్రు సన్నాయిపాటతో డోళ్లచప్పుళ్లతో యెద్దులనాడిస్తున్నారు.

"పండుగరోజులకు ఈబిచ్చగాండ్రవల్లకూడ ఒకవిధమైనశోభ కలుగుతుందిసుమండీ! అన్నగారూ!" అన్నా నేను.

"నీకవితాదృష్టి ఆసౌందర్యమును గ్రోలగలదు" అంటూ ముందునడుస్తున్నారన్నగారు.

రెండుప్రక్కలా నిలువుపొడుగునా పెరిగి పచ్చనిపువ్వులతో దట్టముగానున్న జనపచేలప్రక్కనుంచి నడుస్తుంటే నామనస్సానందతరంగాల్లో ఉయ్యాలలూగేది. తిరిగితిరిగి ఇంటికిజేరుకున్నాం. లతాంతసావిట్లోకూచుని వక్కితో చేమంతిపువ్వుదండలు గ్రుచ్చుతోంది. తదేకధ్యానంతోనున్న లతాంత మమ్మల్నిచూడనేలేదు.

అన్నగారు నాకు సేలంఖండువా అడ్డంగాపట్టుకుని "లతాంతా! నీకో తమాషాచూపిస్తా! నాకేమిస్తావు?" అన్నారు.

"ఆ! నాకుతెలుసులే!" అని లేచినించుంది లతాంత. అన్నగారు తెరతీసేసారు. దోసెడుచేమంతిపువ్వులు మామీదజల్లేసి నవ్వుతూ వెళ్లిపోయింది లతాంత.

"నేనుచూసాలే! నువ్వుచేసినపూజ లతాంతా! ఇంకేం? వ్యవహారంముదిరింది" అంటూనవ్వుతోంది లోపల మణీదేవి. "పోనీలే" అని లతాంత. మావదినెగారు లతాంతపక్షం సమర్థిస్తోంది. ఇల్లంతా ఆనంద కోలాహలం. నామనస్సంతా నవ్యభావకోలాహలం.

మధ్యాహ్నంకూర్చుని 'సుమార్చన' అను శీర్షికక్రింద యెన్నోగీతాలూ, గీతికలూ రాసుకున్నాను.

ఒకప్రక్క చిన్నటేబిల్ మీదనున్న బెడ్ రూమ్ లైట్ ధవళకాంతులు గదంతానింపేస్తోంది.

దోమతెరకట్టిన చెన్నపట్టణపుమంచమునకెదురుగానున్న రోజ్ వుడ్ టేబిల్ మీద లతాంతచేఅల్లబడిన లేసుక్లాత్ ఒకప్రక్క అగరువత్తులచెట్టు, ఒకప్రక్క ఫ్రేములోనమర్చబడిన సరస్వతీఫోటో, నడుమ పారిస్ సెంటులు, గోడలమీద ఆంధ్రచిత్రకారులచే తయారుచేయబడిన చిత్రమాతృకలు, శారదానికేతనములో చదువుచున్నప్పుడు లతాంతచేవ్రాయబడి బహుమతులందినమల్లిక, వనలక్ష్మి-వసంతము అను రెండుచిత్రములు టేబిల్ కు కొంచెముపైగా కట్టిఉన్నాయి. ఎదురుగా రెండురవుండుఛెయిర్సు. ఒకదానిలో పరిపూర్ణాలంకృత లతాంత. ఒకదానిలో నేను.

"లతాంతా! ఉదయాన్నేనీవు నాకుచేసినసుమార్చనకు నీకేంవరమివ్వాలోఅని ఊహిస్తున్నాను. అయినా రేపు పండుగకదా! యేంకావాలోకోరుకో" అన్నా నేను.

"ప్రేమమూర్తీ! సమగ్రమైన నీప్రేమభాగ్యంకంటె నాకు వరణీయం వేరేముంటుంది?" అంది లతాంత చక్కనిభావంతో.

"అయినా నాసూటుకేసులో యేముందోచూచుకో" అని నే తాళాలిచ్చేను. లతాంత నాపెట్టి తెరిచింది. దానిలో ఒకవెడల్పాటి మంచిగంధపుకర్రపెట్టెమీద 'లతాంతకి పండుగబహుమతి' అని రాసిఉన్నదితీసింది. "మహాభాగ్యము"అంటూ పెట్టెతెరిచింది లతాంత.

దానిలో లోలాకులజతఉన్నపెట్టి, గృహలక్ష్మిసంక్రాంతిసంచిక.

లతాంత పరమానందభరితురాలైంది. "లోలాకులకంటె గృహలక్ష్మిసంచికప్రియతరం. దానికంటె మీప్రేమ ప్రియతమం" అంది లతాంత.

నాప్రేమసాగరం వేలనతిక్రమించింది.

బహుమతీ ఆమెపెట్టెలోనికి ట్రాన్సుఫరుఅయింది.

* * * *

తెల్లవారుజామున సంక్రాంతిదాసరి "హరోరంగ! కస్తూరిరంగ!" అని చిందులుత్రొక్కుతున్నాడు. మెలకువవచ్చింది.

ఆనాడు పెద్దపండుగ. వీథులోనిండా యెక్కడా సందులేకుండా చిత్రవిచిత్రంగా రంగవల్లులు రచించేరు. ఆంధ్రనారీమణుల చిత్రరచనానైపుణ్యం ఆముగ్గుల 'డిజైన్ల'లో గోచరిస్తోంది. కొన్నిముగ్గుల క్రింద మావదినెగారిపేరు ఇంగ్లీషున రాయబడిఉంది.

ఉదయాన్నుంచి మణీదేవీ, అన్నగారూ ఈబహుమతుల్ని గురించి లతాంతను తెగవేళాకోళాలు చేస్తున్నారు. తగినసమాధానాలు చెపుతోంది లతాంత.

పండుగ మహదానందంగా గడిచింది. మధ్యాహ్నం గానసభ పెట్టించాం. నేనూ, అన్నగారూ, మాబావా, మణీదేవీ, మాఅత్తగారూ, మామగారూ సభికులం. మావదినెగారు వీణ, లతాంత గాత్రం. పాటకచ్చేరీ.

ఈరోజున లోలాకులుకూడా పెట్టుకొని లతాంత సంపూర్ణసౌందర్యంతో నాకళ్లకి నిజమైనపండుగ చేసింది.

ఆసాయంకాలం ఒకఫోటోగ్రాఫర్ని పిలిపించి చాలాఫోటోలు తియ్యించుకున్నాం.

ఫామిలీగ్రూప్ ఒకటి. దంపతులు ఒక్కొక్కటి.

మరునాడు వెడతానంటే కనుమన్నారు. ముక్కనుమునాడు లతాంత, వదినెగారూ, మణీదేవీ పేరంటాండ్రతో బాజాలతో బొమ్మలనోము కెడుతున్నారు. నేను మనిషిచేతిసూటుకేసిచ్చి ప్రయాణమై వెడుతున్నాను. లతాంత హరిణేక్షణాలు నామనస్సును వెనక్కిలాగుతున్నా శరీరంమాత్రం విధిలేక ముందుకెడుతోంది.

తక్షణం జ్ఞాపకమొచ్చింది.

'చీనాంశుకమివ కేతోః ప్రతివాతంనీయమానస్య'

నాలాడ్జిలో ప్రవేశించేవరకు నాకానాటి లతాంతపలుకే స్ఫురిస్తోంది. "లోలాకులకంటె గృహలక్ష్మి సంచికే ప్రియతరం దానికంటె మీప్రేమయే ప్రియతరం."

విరిదండ

దామెర పెదవెంకయ్యగారు

మావిచివురాకు చెంగావి తీవకొనలఁ
బికము మధుమాసగీతమాలికలఁగూర్చి
లలన! భవదీయకంఠ మలంకరించు.
మంజులశ్రుతిగడియ బంభరముకడఁక
మధుకణమ్ముల నొండొంట మాలఁగూర్చి
లలన! భవదీయకంఠ మలంకరించు.
పూవుటీరాలు చివురాకు మొనలఁదీర్చి
మంచుబొట్టులముత్యాలమాలఁగూర్చి
లలన! భవదీయకంఠ మలంకరించు.
దిక్తటమ్ములఁబనివడి తిరిగితిరిగి
లీల నీగాలి వలపులమాలికలఁగూర్చి
లలన! భవదీయకంఠ మలంకరించు.
ప్రణయసూత్రపుగ్రొవ్వాడి కొనలఁదీర్చి
లలితభావప్రసూనమాలలఘటించి
లలన నీడెంద మేనయలంకరింతు.
పలఫలని జాలువారెను వలపుఁజూచి
తొంగలించెను కంఠమాధురిఁదలంచి
తరుణి! నీడెందమునకివి తగినవనుచు
నీసనలదండ నేరచియించినాఁడ.
నక్కటా! యివిభావసూన్యమ్ములంట!
వలపు నిండారమాధురుల్ వచ్చికొనఁగ
విమలభావతరంగముల్ వెల్లిగొలుప
విరియునాహృదయంపు గ్రొవ్విరియొకండె
వెలఁది! ప్రియమార దాని నర్పింతునీకు
దాల్చుమీడెందమున విరిదండవోలె!

—బాష్పములు.